www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 67 బుధవారం, జూలై 22, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad








- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ,జూలై 21 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలిం చారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసు లు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షా ల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ మిగతా2లో...

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



**హైదరాబాద్,జూలై 21 :** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజర య్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా మిగతా2లో...

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూలై 21 :** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ మిగతా2లో...



# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

**ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు**

**హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్**

**హైదరాబాద్,జూలై 21 :** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా - సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం మిగతా2లో...

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హన్మకొండ,జూలై 21 :** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్ధంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మిగతా2లో...

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్


2లో



# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

**కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత**

**హైదరాబాద్,జూలై 21 :** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. మిగతా2లో...

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం**

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు**


2లో




# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు**

**సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**రంగారెడ్డి,జూలై 21 :** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మిగతా2లో...



2లో

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా..?**

**దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం**

**రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు**

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నేతలు చేతులకుసంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శిం చారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**హైదరాబాద్,జూలై 21 :** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాట కం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖా స్తుకు రూ. 10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాం పల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తు న్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చిం చకుండా దీన్ని అమలు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణ నలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయా లన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్దాలా?

**హైదరాబాద్,జూలై 21:** కాళేశ్వ రం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు.




వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్సాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

**హైదరాబాద్,జూలై 21 :** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలం లోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలనిఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్‌ను మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

# ఢిల్లీలో నీట్ కు వ్యతిరేక ఆందోళనలు చేసిన విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి:

**దామాల సత్యం**
**విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి**
**-- నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాల పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (TSSA) డిమాండ్**




ఖమ్మం/ జూలై 21/(పీపుల్స్ న్యూస్ )
– ఢిల్లీలో నీట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం.
– విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.
– కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి.
– నీట్ పరీక్షను రద్దు చేసి రాష్ట్రాల పరిధిలో నిర్వహించే విధానం తీసుకురావాలి.
– విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలి.
– విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.
ఢిల్లీలో నీట్ పరీక్షకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దురదృష్టకరమని, ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ( రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని ఆరోపించారు. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకులు, అవకతవకలు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో తమ హక్కుల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై లాఠీ దాడులు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని విమర్శించారు. విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి. విద్యార్థుల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు" అని దామాల సత్యం పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ప్రవేశ పరీక్షల నిర్వహణకు అవకాశం కల్పించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీరబాబు రావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : పాగర్తి సుధాకర్



ఖమ్మం/నేలకొండపల్లి/జులై 21/(పీపుల్స్ న్యూస్)
బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ను కలసిన పారిశుధ్య కార్మికులు ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణా లో గ్రామ పంచాయతీలలో పనిచేసే పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, వారికీ కనీస వేతనం పెంచాలని కోరారు, పారిశుధ్య కార్మికులలో ఎక్కువగా దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారినని, చాలి చాలని జీతాలతో వారు జీవితం గడుపుతున్నారని, వారికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు, వారి డిమాండ్ల సాధన కోసం బీజేపీ నేలకొండపల్లి మండల కమిటీ ఎల్లపుడు అండగా ఉంటుందని అన్నారు, ఈ సందర్భంగా కలసిన వారిలో పారిశుధ్య కార్మికులు షేక్ రహమతుల్లా, పి. బాబు, జిల్లపల్లి వీరబాబు, పార్టీ నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, జెల్లా సురేష్ ఉన్నారు.

## రేగొండ మండల కళాకారుల సంఘం అధ్యక్షులుగా బోనగాని కోమల.



రేగొండ,జులై21(పీపుల్స్ న్యూస్)
జానపద కళాకారుల సంక్షేమ సంఘం రేగొండ మండల అధ్యక్షురాలుగా బోనగాని కోమల నియమితులయ్యారు. రేగొండ మండలం కోటంచ శ్రీ లక్ష్మీనరసింహ భజన మండలికి చెందిన బోనగాని కోమల ను అధ్యక్షురాలుగా జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు పోలసాని దేవేందర్ రావు నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షురాలుగా కోమల, సహాయ కార్యదర్శిగా పైల్ల మల్లయ్య ను తోటి కళాకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు దేవేందర్ రావు కోమల, మల్లయ్య లకు నియామక పత్రాలను అందజేశారు. మండలంలోని కోటంచ గ్రామానికి చెందిన కోమల అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో ఆమె మాట్లాడుతూ.. కళాకారుల సంక్షేమం ఐక్యత కోసం కృషి చేస్తానని, కళాకారుల సంఘాన్ని బలోపేతం చేస్తూ, కళాకారులను గుర్తించి ప్రభుత్వం పింఛన్ వంటి సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోమల కోరారు.

# "కేజ్ వీల్స్‌తో రోడ్లపైకొస్తే కఠిన చర్యలు

**.పస్రా ఎస్సై తాజుద్దీన్ హెచ్చరిక.**




ములుగు జిల్లా ప్రతినిధి జూలై 21 (పీపుల్స్ న్యూస్ )
గోవిందరావుపేట మండల కేంద్రంలోప్రస్తుతం వరి నాట్ల సీజన్ ఊపందుకోవడంతో రైతులు వ్యవసాయ పనులకు ట్రాక్టర్లను విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే పొలాల్లో దున్నేందుకు వాడే కేజ్ వీల్స్ ఇనుప చక్రాలు తొలగించకుండా ప్రధాన రహదారులపైకి తీసుకురావడంపై పస్రా ఎస్సై తాజుద్దీన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేజ్ వీల్స్ వల్ల రోడ్లు ధ్వంసమవడమే కాకుండా తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ కొన్ని కీలక సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన తారు రోడ్లు ఇనుప కేజ్ వీల్స్ వల్ల పూర్తిగా దెబ్బతింటున్నాయని తెలిపారు. కేజ్ వీల్స్ మొనలు రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. రైతులు పొలం పనులు ముగిసిన వెంటనే కేజ్ వీల్స్‌ను తొలగించాలని సూచించారు. సాధారణ టైర్లు అమర్చుకున్న తర్వాతే రోడ్డుపైకి రావాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి కేజ్ వీల్స్‌తో రోడ్లపై తిరిగే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సదరు యజమానులపై మోటార్ వాహనాల చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా బృందాలతో తనిఖీలు నిర్వహిస్తుందని చెప్పారు. రైతు సోదరులంతా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై తాజుద్దీన్ పిలుపునిచ్చారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి.

**- బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు డిమాండ్**



నేలకొండపల్లి/ఖమ్మం /, జూలై 21(పీపుల్స్ న్యూస్)
ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నేలకొండపల్లి మండల బీఎస్పీ అధ్యక్షులు బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను జూలైలోగా పూర్తిచేసి, ఆగస్టు నుంచి అన్ని సంక్షేమ పథకాలు అమలుచేయాలని సూచించారు. ఉద్యమకారులకు ఇండ్లు లేదా ప్లాట్లు కేటాయించడంతోపాటు నెలకు రూ.25 వేల పింఛన్ హామీని అమలుచేయాలి. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాటయోధులకు కల్పిస్తున్న తరహాలోనే మలిదశ తెలంగాణ ఉద్యమ కారులకు కూడా అన్నిరకాల సంక్షేమ ప్రయోజనాలు అందించాలి. సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యోగుల సేవలను గుర్తించాలి. అమరవీరుల కుటుంబాలకు కూడా తక్షణమే ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసి.. ఉచిత బస్ పాస్ తో పాటు ఉచిత వైద్యం కల్పించాలి. జార్ఖండ్ లో ఉద్యమకారుల కోసం అమలుచేస్తున్న విధానాన్ని ఇక్కడ కూడా అమలుచేయాలని కోరారు.

# శిధిలమై పోతున్నదన్నా...చదువుల తల్లి బంగ్లా..( లైబ్రరీ)



ఖమ్మం /నేలకొండపల్లి/జులై 21/(పీపుల్స్ న్యూస్)
నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ లో లైబ్రరీకి శానా చరిత్ర ఉన్నది 50 సంవత్సరాల గణ చరిత్ర ఉన్నది గి లైబ్రరీ మస్తు మంది మేధావులను, రాజకీయ నాయకుల్ని, ప్రభుత్వ నౌకరీలను తయారు చేసింది. అధికారులు వచ్చింన్రు రాజకీయం నాయకులు వచ్చింన్రు కొబ్బరికాయ కొట్టింన్రు బంగ్లా కట్టుడు సీడ్ గా పని జరగాలని ఆ దేవునికి సుత మొక్కిన్రు గాని రెండేళ్లు ఒడిసినై లైబ్రరీ బంగ్లా ముందు పడతలేదు కొలువులకు చదివేటోళ్లు, విజ్ఞానం కోసం చదివేటోళ్లు, మస్తు బాధ పడుతున్నరు, లైబ్రరీ పుస్తకాలు, చరిత్ర పుస్తకాలు, కొలువుల కోసం చదివే పుస్తకాలు పురాతన పుస్తకాలు అన్ని గూడా కరాబ్ అవుతున్నయ్, ఆరు నెలల్లో బంగ్లా కట్టుడు పూర్తిచేయాలని మొదలుపెట్టింన్రు కానీ, సగం వరకు కట్టి బంద్ పెట్టింన్రు పిల్లర్ సలాకులు జంగు వస్తున్నాయి, కట్టక ముందే శిధిలాల్లో చిక్కుకున్న చదువుల తల్లి, అధికారులు నాయకులు చదువుల తల్లిని కాపాడాలని పాఠకులు కోరుతున్నారు.

## నేడు కోటంచ ఆలయంలో స్వామి వారి కళ్యాణం.



రేగొండ,జులై 21(పీపుల్స్ న్యూస్)
రేగొండ మండలంలోనికోటంచ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నేడు (బుధవారం) స్వాతి నక్షత్ర కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, ఈవో బిల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. కోటంచ లక్ష్మీనరసింహస్వామి నందు లోక కళ్యాణార్థం ప్రతీ నెలలో వచ్చేశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిగే మహోత్సవంలో భక్తుల మధ్యన స్వామి వారికి పూజారులు వేదమంత్రాల మధ్యన కళ్యాణ కళ్యాణాన్ని నిర్వహిస్తుంటారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఉమ్మడి రేగొండ మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్క మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకిస్తారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా బుధవారం ఉ. 9.00 నుండి 10.00 గంటల వరకు శ్రీ సుదర్శన -నారసింహ హోమం, ఉ . 10.00 నుండి 11.00 గంటల వరకు శ్రీ స్వామివారి అభిషేకం..ఉ. 11.00 నుండి 12.00 వరకు శ్రీ స్వామి వారి కళ్యాణం వేడుకలను జరుగుతాయన్నారు. కళ్యాణ అనంతరం తదుపరి ఆరగింపు .. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడం జరుగుతుందని కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో శ్రీ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఆలయ చైర్మన్ ఈవో దగ్గరుండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. అన్ని ఏర్పాట్లను ఆలయ రికార్డ్ అసిస్టెంట్ వెంగళ దివ్య, గోరంట్ల శ్రావణ్ సోన్నాయిల సుధాకర్ నాగుల సుదర్శన్ బోసు రవి తదితర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ములుగు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

**- మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 21 (పీపుల్స్ న్యూస్)**

ములుగు జిల్లాలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులందరికీ తెలంగాణ ప్రభుత్వం తరపున స్వాగతం పలుకుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. అయితే పర్యాటకులు తమ ఆనంద యాత్రను విషాదంగా మార్చుకోకుండా తప్పనిసరిగా జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, అటవీ శాఖ అధికారులు జారీ చేస్తున్న సూచనలు, హెచ్చరికలను పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క వీడియో సందేశం విడుదల చేశారు. ములుగు జిల్లా ప్రకృతి సంపదకు నిలయమని, దట్టమైన అడవులు, గోదావరి పరీవాహక ప్రాంతం, బొగత జలపాతం, అందమైన సెలయేళ్లు, చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రతి ఏడాది వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ మేడారం, రామప్ప దేవాలయం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే ప్రతి ఒక్కరూ సురక్షితంగా వెళ్లి సంతోషకరమైన జ్ఞాపకాలతో తిరిగి వెళ్లాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. ఇటీవల


నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పో

వడం తీవ్ర విషాదకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. లోతైన అడవులు, ప్రమాదకరమైన జలపాతాలు, కొండ చరియలు, వేగంగా ప్రవహించే వాగులు, సెలయేళ్ల వద్దకు వెళ్లవద్దని ఇప్పటికే పోలీసులు, అటవీశాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ కొందరు ఆసక్తితో బ్యారికేడ్లను దాటి నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటకుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటరాదని, హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా గౌరవించాలని, సెల్ఫీలు లేదా వీడియోల కోసం ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలను రిస్క్ చేయవద్దని సూచించారు. ముఖ్యంగా డీప్ ఫారెస్ట్ ప్రాంతాలు, లోతైన జలపాతాలు, వేగంగా ప్రవహించే వాగులు, కొండల అంచులు వంటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, భద్రతా నిబంధనలు పాటిస్తేనే ప్రయాణం సురక్షితంగా, ఆనందంగా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలను పాటించి తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల భద్రత పట్ల కూడా బాధ్యతతో వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడు అరెస్టు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్):**

ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని దబీర్‌పురా పోలీసుల చాకచక్యంగా అరెస్ట్ చేసి అతని నుంచి రెండు హోండా యాక్టివాల స్వాధీనం చేసుకున్నారు. దబీర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ద్విచక్ర వాహన చోరీ కేసులో ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు, మంగళవారం ఉదయం 10:00 గంటలకు పాత నేరస్థుడైన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వ్యక్తి దొమల్‌గూడా పోలీస్ స్టేషన్‌కు చెందిన సస్పెక్ట్ షీటర్ గా గుర్తింపు పొందాడు. దొమల్‌గూడా కు చెందిన దాసరి శ్యామ్ అలియాస్ నర్సింగ్ (55), హోటల్ కార్మికుడు న్యూ మలక్‌పేట్, కాలాడేరాలోని ఎంఎస్ స్కూల్ సమీప నివాసి, బండ్లగూడలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్న శ్రీ మీర్ ముర్తుజా రబ్బానీ (35) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడు తన తెల్లని రంగు హోండా యాక్టివా 3+ (రిజిస్ట్రేషన్ నెం. టీఎస్ 11ఈజీ4889) ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 12న ఉదయం 11:00 గంటలకు తన ఇంటి ముందు పార్క్ చేశారు. అయితే 14 న సాయంత్రం 6:00 గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు చూడగా, వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల, కుటుంబ సభ్యులు, స్నేహితులను విచారించినప్పటికీ వాహనం లభించకపోవడంతో అజ్ఞాత వ్యక్తులు దొంగిలించినట్లు అనుమానించి 'డయల్ 100' ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. దీని ఆధారంగా దబీర్‌పురా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు లో వాహనాల స్వాధీనం దర్యాప్తులో భాగంగా ఈ నెల 21ప ఉదయం 10:00 గంటలకు దబీర్‌పురా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించగా, అతని వద్ద నుండి క్రింది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు: నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచడం జరిగింది. ఇతర ఆస్తి సంబంధిత నేరాలలో ఇతని ప్రమేయం ఉందా అనే కోణంలో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. చార్మినార్ జోన్ అదనపు డిసిపి కె.ఎండీ. మజీద్, మలక్‌పేట్ డివిజన్ ఏసిపి ఎల్. రాజా వెంకట్ రెడ్డి ల పర్యవేక్షణలో, దబీర్‌పురా ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. ఉపశంకర్ మార్గదర్శకత్వంలో ఎస్.ఐ ఎస్. కీర్తి వారి బృందం ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నారు.

# మల్లి కార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో సహా కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**- మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 21,( పీపుల్స్ న్యూస్)**

ఢిల్లీలో విద్యార్థుల గొంతుకగా నిలబడి ప్రశ్నించిన ప్రతిపక్ష అగ్రనేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వంటి అత్యంత కీలక అంశంపై సమాధానాలు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నించే వారిని అణచివేయడానికి ప్రయత్నించడం దురదృష్టకరం. విద్యార్థుల పక్షాన నిలబడి మాట్లాడితే అరెస్టు చేస్తారా? ఇదేనా ప్రజాస్వామ్యంనీట్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దేశ యువత భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై పార్లమెంటు లోపల చర్చకు అవకాశం ఇవ్వడం లేదు, బయట ప్రశాంతంగా నిరసన తెలిపినా అడ్డుకుంటున్నారు. అసలు



చర్చకు ఎందుకు భయపడుతున్నారు? బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారు? అనే ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఈ అంశంపై నిరసనల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం హేయమైన చర్య. తక్షణం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ప్రభుత్వాన్ని జవాబుదారీతనంతో నిలదీయడం ప్రతిపక్షం బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్న నాయకులపై అరెస్టులు, నిర్బంధాలు చేయడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించలేరు. విద్యార్థుల భవిష్యత్తు, దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయత.. రాజకీయాలకు అతీతమైన అంశాలు. నీట్ లీకేజీ వ్యవహారంపై పారదర్శకంగా సమగ్ర చర్చ జరిపి, నిజమైన బాధ్యులను శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి.

# బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీ షీటర్ చలానా రుసుము చెల్లింపు

**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్) :**

శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం నమోదు చేసిన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీ షీటర్ చలానా రుసుము చెల్లించారు. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం...... రౌడీ షీటర్ గడ్డం అక్షయ్ కుమార్ మునుపటి కోర్టు ఉత్తర్వులు: సత్ప్రవర్తన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టు సదరు రౌడీ షీటర్‌కు రూ.30,000 ల చలానా (జరిమానా) విధించింది. మినహాయింపు , సవరించిన ఉత్తర్వులు సదరు చలానా మొత్తాన్ని తగ్గించాల్సిందిగా రౌడీ షీటర్ గడ్డం అభ్యర్థించగా, అతని విన్నపాన్ని పరిశీలించిన స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టు చలానా మొత్తాన్ని రూ.20,000 లకు సవరిస్తూ నిబంధనలు జారీ చేసింది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు రౌడీ షీటర్ గడ్డం అక్షయ్ కుమార్ సోమవారం సవరించిన చలానా మొత్తం రూ.20,000ల ను చెల్లించినట్లు తెలియజేస్తున్నాము. ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే రౌడీ షీటర్లు , నిత్య నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని, బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్రమైన చట్టపరమైన పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.



# రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌పై పి.డి. చట్టం అమలు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్):**

కరుడుగట్టిన రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌పై పి.డి. చట్టం కింద హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను చిలకలగూడ పోలీసులు అమలు చేశారు. నగరంలో నిత్య నేరస్థుల పట్ల రాజీలేని "జీరో టాలరెన్స్" విధానాన్ని అమలు చేస్తున్న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్, ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర ముప్పుగా మారిన చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కరుడుగట్టిన రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌పై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన ఈ పీడీ యాక్ట్ ఉత్తర్వులను చిలకలగూడ పోలీసులు మంగళవారం విజయవంతంగా అమలు చేశారు. వివరాల ప్రకారం.... బొజ్జ భాగ్యరాజ్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరుడుగట్టిన రౌడీ షీటర్ మరియు నిత్య నేరస్థుడు. ఇతడు వరుసగా హింసాత్మక నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు, అభద్రతా భావాన్ని సృష్టిస్తూ ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాడు. హైదరాబాద్ , మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇతనిపై మొత్తం 15 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇందులో హత్యాయత్నం, అల్లర్లు, తీవ్ర గాయాలు కలిగించడం, బెదిరింపులు, పోక్సో చట్టం కింద నేరాలు ఇతర తీవ్రమైన నేరాలు ఉన్నాయి. గతంలో ఇతడిపై రెండుసార్లు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం అమలు చేయబడింది. అనంతరం సత్ప్రవర్తన పాటించాలని భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 128 ప్రకారం బైండోవర్ చేసినప్పటికీ, ఆ నిబంధనలను ఉల్లంఘించి మళ్లీ



తీవ్రమైన నేరాలకు పాల్పడ్డాడు. ఇటీవల చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో వరుసగా మూడు హత్యాయత్నం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీటిలో రెండు కేసుల్లో న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినప్పటికీ, ఆ బెయిల్ షరతులను ఉల్లంఘిస్తూ తిరిగి నేరాలకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ఇతడు న్యాయస్థాన రిమాండ్‌లో ఉన్నాడు.


**పీడీ ఉత్తర్వుల జారీ అమలు:**


ఇతని నిరంతర నేరపూరిత ప్రవర్తన, బెయిల్ షరతులు , బైండోవర్ నిబంధనలను పదేపదే ఉల్లంఘించడం, అలాగే ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర ముప్పుగా మారిన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం, భవిష్యత్తులో ఇటువంటి నేరాలకు పాల్పడకుండా నిరోధించేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గారు పీడీ యాక్ట్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ ప్రతిపాదనను చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వలిశెట్టి రామకృష్ణ , వారి బృందం సమర్థవంతంగా సిద్ధం చేశారు. పీడీ యాక్ట్ ఉత్తర్వుల అమలు ప్రక్రియను ఏసీపీ చిలకలగూడ డివిజన్ శ్రీ కె. శశాంక్ రెడ్డి పర్యవేక్షించగా, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సికింద్రాబాద్ జోన్) జె. నర్సయ్య సమగ్ర పర్యవేక్షణలో చిలకలగూడ పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. హైదరాబాద్ నగరాన్ని సురక్షితమైన, ప్రశాంతమైన శాంతిభద్రతలు నెలకొన్న నగరంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారు. నగరంలో చోటుచేసుకునే నేరాలు, సంఘవిద్రోహ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తూ ప్రజలు తమ అమూల్యమైన సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**నిత్య నేరస్థులకు హెచ్చరిక:**

నేరాల పట్ల హైదరాబాద్ సిటీ పోలీసులు "జీరో టాలరెన్స్" విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. నిత్య నేరస్థులు, రౌడీ షీటర్లు, వ్యవస్థీకృత నేరస్థులు మరియు సంఘవిద్రోహ శక్తులు ఇకపై నేరాలకు పాల్పడితే పీడీ చట్టం అమలుతో పాటు అత్యంత కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు..

# మైనర్ బాలికలపై ఆత్యాచారానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులకు కఠిన జైలు శిక్ష




**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్) :**

మైనర్ బాలికలపై ఆత్యాచారానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులకు ఎల్.బి.నగర్‌లోని స్పెషల్ పోక్సో కోర్టు మంగళవారం కఠిన జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం........ బాలాపూర్ కు చెందిన సంపంగి చంద్రశేఖర్ (23), రంగారెడ్డి జిల్లా కు చెందిన బొల్లిపాక మధు (22) లు మైనర్ బాలికలపై ఆత్యాచారానికి పాల్పడ్డారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన ఈ కేసులో పోక్సో యాక్ట్ , ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్) కేసులో విచారణ పూర్తి చేసుకుని, కోర్టు తుది తీర్పు వెల్లడించింది. ఎల్.బి.నగర్‌లోని గౌరవ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ రేప్ అండ్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితులకు 10 ఏళ్లు, 5 ఏళ్ల జైలు శిక్షలు ఖరారు చేశారు. న్యాయస్థానం బాధితులకు ఆర్థిక ఊరటనిస్తూ మొదటి బాధితురాలికి రూ. 50,000లు రెండవ బాధితురాలికిరూ. 1,00,000 చొప్పున విక్టిమ్ కాంపెన్సేషన్ (పరిహారం) మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతమైన ఆధారాలు సేకరించి, కోర్టులో నిలబెట్టిన దర్యాప్తు అధికారులు పోలీస్ బృందాన్ని అధికారులు అభినందించారు. నాటి దర్యాప్తు అధికారి (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్) బి. భాస్కర్ (ప్రస్తుతం యాదగిరిగుట్ట పిఎస్), రెండవ దర్యాప్తు అధికారి (ఏసిపి) కె. పురుషోత్తమ్ రెడ్డి (ప్రస్తుతం డెస్పీ జగిత్యాల), అదనపు పిపిలు పి. సత్యనారాయణ, గంగా రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ (సిడిఓ) హెచ్‌సి కె. శ్రీనివాస్ రెడ్డి , సమ్మన్స్ పీసీ కె. రామ్‌దాస్ ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వ్యవహరించారు. మైనర్ బాలికల భద్రతకు భంగం కలిగించే నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలియజేశారు.

# రఘునాథపాలెం మండల ఉపసర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మం జిల్లా, జూలై 21 (పీపుల్స్ న్యూస్) :** రఘునాథపాలెం మండల ఉపసర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు ధరావత్ సుధాకర్ , జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి సాంబశివరావు అధ్యక్షతన మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నుకోబడిన వారికి వివిధ పార్టీ నాయకులు, జిల్లా ,మండల కార్యకర్తలు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా బండి వెంకన్న, ఉపాధ్యక్షులుగా నునవత్ రవి, ప్రధాన కార్యదర్శిగా బానోత్ శ్రీను, కార్యదర్శిగా భీమ్లా నాయక్, సలహాదారులుగా కిషన్, భరత్, వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నునవత్ రవి రఘునాథపాలెం మండల ఉపసర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల గ్రామ ప్రజలు, మిత్రులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## నీట్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి.




**దౌల్తాబాద్, జూలై 21(**
నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాల వల్ల వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోనేరు ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు అప్పల ప్రణయ్, గొల్లపల్లి ప్రవీణ్, ముద్రకొల్ల వరుణ్ తేజ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే,డాక్టర్ లక్ష్మన్న వర్ధంతి సందర్భంగా పండ్ల పంపిణీ





**వలిగొండ జులై 21**
వలిగొండ మండల కేంద్రంలోని చిరంజీవి హాస్పిటల్ వ్యవస్థాపకులు కీర్తిశేషులు డాక్టర్ లక్ష్మన్న మొదటి వర్ధంతి సందర్భంగా టేకులసోమవారం గ్రామంలో మానస వికలాంగుల ఆశ్రమంలో ఎడవల్లి అనిల్ , ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎంతోమంది కి వైద్య సేవలు అందించారు అని అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ బలరాం (ఎంబిబిఎస్) మరియు ల్యాబ్ టెక్నీషియన్ బత్తిని వెంకటేశం గౌడ్, పోలేపాక రాజేష్, వేములనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీరేశం కు మంత్రి హోదా పట్ల బెల్లి సత్తయ్య హర్షం:


**చిట్యాల జూలై 21**
నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం కు మంత్రి హోదా పట్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బెల్లి సత్తయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందించడం అభినందనీయమన్నారు. వీరేశంకు మంత్రి హోదా లభించడం వల్ల నకిరేకల్ నియోజకవర్గంతో పాటు చిట్యాల పురపాలక సంఘం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ?ఎమ్మెల్యే వీరేశం కు ఈ ఉన్నత స్థానాన్ని కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా బెల్లి సత్తయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.





# ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తృత స్థాయి బందోబస్తు ఏర్పాట్లు













**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్):**
హైదరాబాద్ నగరంలోని గోల్కొండ ట్రాఫిక్ జోన్ పరిధిలో శ్రీ జగదాంబికా అమ్మవారి బోనాల మహోత్సవాలు ఈ నెల 16 నుండి ఆగస్టు 13- వరకు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్ ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తృత స్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ బందోబస్తును జాయింట్ సిపి (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో , డిసిపి (ట్రాఫిక్) కాజల్, ట్రాఫిక్, గోల్కొండ జోన్ ఏసీపీ డి. ధనలక్ష్మిల నిరంతరం సమీక్షిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సుగమం చేయడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ మొదటిసారిగా డ్రోన్ సర్వేలెన్స్ (డ్రోన్ల నిఘా) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. డ్రోన్ల సహాయంతో పార్కింగ్ స్థలాలు, ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను ఎప్పటికప్పుడు ఆకాశ మార్గం ద్వారా పర్యవేక్షిస్తూ, ట్రాఫిక్ జామ్‌లను తక్షణమే నివారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. డ్రోన్ సర్వేలెన్స్ ప్రాముఖ్యత: ట్రాఫిక్ మళ్లింపు పాయింట్ల పర్యవేక్షణ ముందస్తుగా ప్రకటించిన రూట్ డైవర్షన్ల ప్రకారం వాహనాలు సజావుగా సాగేలా అన్ని ప్రధాన మళ్లింపు పాయింట్లను డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గోల్కొండ కోటకు సమీపంలో ఉన్న కేటాయించిన పార్కింగ్ స్థలాలలో వాహనాల రద్దీని అంచనా వేయడానికి, అనధికార పార్కింగ్‌ను నిరోధించడానికి , భక్తులకు ఖాళీగా ఉన్న పార్కింగ్ స్థలాలను సూచించడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. కోటకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాలు , భక్తులు పెద్ద సంఖ్యలో సమకూరే ప్రాంతాలలో ట్రాఫిక్ ఆటంకాలను తక్షణమే గుర్తించి, వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. ఈ ఆధునిక డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల క్షేత్రస్థాయి ట్రాఫిక్ పరిస్థితిపై సమగ్ర అవగాహన ఏర్పడి, బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఎంతగానో తోడ్పడుతోంది.

# బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావాలి

**- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్**









**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన పలు కీలక అంశాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అధ్యక్షతన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసు శాఖకు సంబంధించిన పలు విధానపరమైన, పరిపాలనా, సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఎస్ఆర్సీ నివేదిక అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను ఉపసంహరించడం ద్వారా దాదాపు 400 మంది పోలీసు సిబ్బందిని, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడం, శాఖలోని సిబ్బంది , వాహనాల ఆడిట్ , అమలు విధానంపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ యూనిట్లను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించే అంశం, తెలంగాణ పోలీసు మాన్యువల్ తుది రూపకల్పన, ఐపీఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్ బెల్ట్‌లు, లాఠీలు వంటి సంప్రదాయ అంశాల ప్రస్తుత అవసరంపై చర్చించారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ సిబ్బందికి సంబంధించిన వివిధ సమస్యలు, వాటి పరిష్కారంలో ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయం, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ వంటి రంగాల్లో కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ & రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటు వంటి అంశాలను సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సాంకేతిక అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీ , కంప్యూటర్ సర్వీసెస్ విభాగాన్ని ఆధునీకరించడం, అలాగే సీసీటీఎన్ఎస్ 3.0 , టీజీ-కాప్ 3.0 , హాక్ఐ 3.0 ప్రాజెక్టుల పురోగతిపై కూడా డీజీపీ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటామని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు.

# 2026 తొలి ఏడు నెలల్లో సైబర్ మోసాల బాధితులకు రూ.25 కోట్లకు పైగా నగదు రీఫండ్

**సైబరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్) :**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైమ్ విభాగం 2026 జనవరి నుండి జూలై వరకు సైబర్ ఆర్థిక మోసాలకు గురైన బాధితులకు చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, సంబంధిత న్యాయస్థానాల ఉత్తర్వుల ఆధారంగా రూ. 25 కోట్లకు పైగా నగదు రీఫండ్ అయ్యేలా విజయవంతంగా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. పుష్ప మాట్లాడుతూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల విశేష కృషి తో 2026 తొలి ఏడు నెలల్లో సైబర్ మోసాల బాధితులకు రూ. 25 కోట్లకు పైగా నగదు రీఫండ్ చేశామన్నారు. ఈ విజయానికి సైబర్ క్రైమ్ పోలీసుల వేగవంతమైన దర్యాప్తు, మోసపూరిత లావాదేవీలను సకాలంలో ఫ్రీజ్ చేయడం, బ్యాంకులు , ఆర్థిక సంస్థలతో సమన్వయం, అలాగే న్యాయపరమైన చర్యలను సమర్థవంతంగా నిర్వహించడం ప్రధాన కారణాలుగా నిలిచాయి. సైబర్ మోసాలకు సంబంధించిన రీఫండ్ ప్రక్రియలో పోలీసులు, బ్యాంకులు మరియు న్యాయవ్యవస్థ కలిసి పనిచేస్తాయి. బహుళ సంస్థల సమన్వయం, చట్టపరమైన విధానాల కారణంగా కొంత సమయం పట్టడం సహజమే. అయినప్పటికీ, బాధితులకు వీలైనంత త్వరగా నగదు తిరిగి అందేలా సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంబంధిత బ్యాంకులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నారు. సైబర్ ఆర్థిక మోసాలకు గురైన వెంటనే ప్రజలు జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయడం లేదా లినేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల మోసపూరిత లావాదేవీలను సకాలంలో ఫ్రీజ్ చేసి, నిధుల రికవరీకి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. బాధితులు లావాదేవీలకు సంబంధించిన అన్ని వివరాలను భద్రపరచి, దర్యాప్తులో పూర్తి సహకారం అందించాలని సూచించారు. సైబర్ మోసాల బాధితులకు నగదు పునరుద్ధరణను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ , ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ ను ప్రవేశపెట్టింది. ఈ పౌరస్నేహపూర్వక డిజిటల్ వేదిక ద్వారా ఫ్రీజ్ చేసిన నిధులను అర్హులైన బాధితులకు సులభంగా, పారదర్శకంగా తిరిగి అందించే ప్రక్రియను రూపొందించారు. నిర్దేశిత విధానాల ప్రకారం సంబంధిత బ్యాంకు రీఫండ్ చేయదగిన మొత్తాన్ని గుర్తించిన తర్వాత, బాధితుడికి ఎస్ఎంఎస్ , ఇ-మెయిల్ ద్వారా ఎంఆర్ఎం పోర్టల్ లింక్ పంపబడుతుంది. బాధితుడు ఎన్సీఆర్పీ అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ ఓటిపి తో లాగిన్ అయి, రీఫండ్ అందుకోవాల్సిన బ్యాంక్ ఖాతా వివరాలను ధృవీకరించడం లేదా నవీకరించడం, పాన్ కార్డు , అవసరమైతే కోర్టు ఉత్తర్వును అప్‌లోడ్ చేసి దరఖాస్తు సమర్పించాలి. అనంతరం ఆ దరఖాస్తు దర్యాప్తు అధికారికి ఆన్‌లైన్ ద్వారా చేరి, చట్టపరమైన నిబంధనల మేరకు పరిశీలన అనంతరం ఆమోదం లభిస్తే సంబంధిత బ్యాంకు నేరుగా బాధితుడి ఖాతాలో రీఫండ్ మొత్తాన్ని జమ చేస్తుంది. ఈ సాంకేతిక ఆధారిత విధానం ద్వారా సైబర్ మోసాల బాధితులకు రీఫండ్ ప్రక్రియ మరింత వేగవంతంగా, పారదర్శకంగా , సులభంగా మారనుంది. గత ఒక నెల కాలంలోనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎంఆర్ఎం పోర్టల్ ద్వారా సుమారు రూ. 2 కోట్ల రీఫండ్ ప్రక్రియను ప్రారంభించి, సైబర్ మోసాల బాధితులకు త్వరితగతిన న్యాయం అందించే దిశగా మరో కీలక అడుగు వేశారు.

బుధవారం, జూలై 22, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 6


### గాజులరామారం 307లో ఐదు ఎకరాల

# ప్రభుత్వ భూమి మాయం?

**- ఆర్మీడ్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా వదలని కబ్జా రాయుళ్లు..!**

**- రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలు**









**కుత్బుల్లాపూర్ : జూలై 21 (పీపుల్స్ న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం ప్రాంతంలో సర్వే నంబర్ 307లో ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ భూమి గతంలో హైడ్రా అధికా రులు ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించడంతో అనంతరం ప్రభుత్వం ఆ స్థలాన్ని ఆర్మీడ్ అవసరాల కోసం కేటాయించి ంది. అయితే ప్రస్తుతం ఆ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్లాట్లుగా మార్చి విక్రయించి కోట్లు ఆర్జిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న ఈ స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు రెవెన్యూ అధికారుల సహకారంతో తమ ఆధీన ంలోకి తీసుకుని కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రభుత్వ ఆస్తి క్రమంగా మాయమైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమిలో ఇప్పటికే తాత్కాలిక నిర్మాణాలతో పాటు శాశ్వత భవనాలు కూడా వెలుస్తున్నాయని, స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. పలుమార్లు సంబం ధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు చెబుతు న్నారు. స్థానిక సామాజిక కార్యకర్తలు మాట్లాడు తూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూములపై కబ్జాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక అక్రమాలకు సహకారం ఉందనే అను మానాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ భూమికి సంబంధించిన అసలు రికార్డులు, ఎఫ్ఎంబీ స్కెచ్‌లు, సర్వే వివరాలు, భూ కేటాయింపు పత్రాలను పరిశీలించి పూర్తి స్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, హైడ్రా, సంబంధిత శాఖలు స్పందించి సమగ్ర విచారణ చేపడతారా? ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడతారా? అనే ప్రశ్నలు ఇప్పుడు గాజులరామారం ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**కేసులు బుక్ అయినా భయమే లేదు..! కబ్జారాయుళ్ల దూకుడు పెంచిన కబ్జారాయుళ్లు.**

ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జారాయుళ్లు కేసులు నమోదైనా ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రా ంగం కేసులు నమోదు చేసినప్పటికీ, వాటిని లెక్కచేయకుండా అదే ప్రాంతాల్లో తిరిగి నిర్మా ణాలు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది క్రితం హైడ్రా అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాల స్థలాల్లోనే మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభిం చడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టాన్ని ధిక్కరిస్తూ బహిరంగంగానే నిర్మాణాలు కొనసాగుతుండటం వెనుక కొంతమంది అధికా రుల సహకారం, రాజకీయ నాయకుల అండ దండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను ఆక్ర మించి, వాటిని చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి అమాయక, పేద కుటుంబాలకు విక్రయిస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములేనని తెలియక ఎంతోమంది తమ జీవితకాల పొదుపును వెచ్చించి ప్లాట్లు కొను గోలు చేసి చివరకు నష్టపోతున్న పరిస్థితి ఏర్ప డుతోందని చెబుతున్నారు. హైడ్రా కూల్చివేతల తర్వాత కూడా అదే ప్రాంతంలో తిరిగి నిర్మా ణాలు జరగడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్న లు లేవనెత్తుతోంది. ఇప్పటికే కేసులు నమోదైన వ్యక్తులు మళ్లీ అదే తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్నా, వారిపై కఠిన చర్యలు లేకపో వడం వల్లే ఇలాంటి అక్రమాలు పునరావృతమ వుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతు న్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు కేవలం కూల్చివేతలు, కేసుల నమోదుతో సరిపెట్టకుండా, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను శాశ్వతంగా అడ్డుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ కబ్జాలకు సహకరిస్తున్న అధికారులపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## పబ్లిక్ న్యూసెన్స్ చేస్తే జైలు శిక్షే!





**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 21 (పీపుల్స్ న్యూస్):**

పబ్లిక్ న్యూసెన్సుకు పాల్పడిన వ్యక్తికి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, కుషాయిగూడ 1 రోజు జైలు శిక్ష రూ. 500 జరిమానా విధించింది. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ తీర్పు హెచ్చరిస్తోంది. బాధ్యత గల పౌరులుగా ఉందాం, ప్రజా ప్రశాంతతను కాపాడుదాం!

## సోనమ్ వాంగ్‌చుక్‌కు భారీ ఊరట

**ఢిల్లీ:** ఢిల్లీలో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌కు భారీ ఊరట లభించింది. ఆయనను చికత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు ఢిల్లీ హై కోర్టు అనుమతించింది. ఈ మేరకు ఢిల్లీ హై కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీ, జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేశారు. సీజేపీ చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ పోలీసులు ఆయనను స్థానిక సఫ్దర్‌గంజ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఆయన భార్య గీతాంజలి అంగ్మో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయనకు మెరుగైన చికిత్స అందించేందుకు సఫ్దర్‌గంజ్ ఆస్పత్రి నుంచి గుర్గావ్‌లోని మేదాంత అనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు అనుమతించాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై విచారించిన కోర్టు ప్రభుత్వ స్పందన కోరింది. అయితే, ఆయనను కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించే విష యంలో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. వైద్యుల అనుమతితో ఆయనను వేరే ఆస్పత్రికి తరలించవచ్చని



చెప్పింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు నివేదించారు. ఈ విషయంలో వైద్యుల సలహా మేరకు వ్యవహరించవచ్చని కోర్టుకు తెలిపారు. ఆయన ఆరోగ్యం కోసం వైద్యులు నిర్ణయం తీసుకుంటారన్నారు. అయితే, వాంగ్‌చుక్ చుట్టూ ఉన్న కొందరి తీరుపై ప్రభుత్వ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని కొందరు స్వార్థానికి వాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. వాంగ్‌చుక్‌ను మేదాంత ఆస్పత్రికి తరలించేందుకు అనుమతించింది. అక్కడ అందుతున్న చికిత్స కూడా మేదాంతలో కొనసాగించాలని, ఈ విషయంలో వైద్యుల సూచలను పాటించాలని ఆదేశించింది.

## ఒకే కాన్పులో నలుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చిన మహిళ

**ఆస్ట్రేలియా :** కు చెందిన ఓ 34 ఏళ్ల మహిళ ఆశ్చర్యకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఆమె ఇటీవల నలుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. నలుగురూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. అప్పటికే ముగ్గురు చిన్న పిల్లలను పెంచుతున్న ఆ ఇంటిసభ్యుల సంఖ్య ఈ నలుగురు పిల్లల రాకతో మొత్తం 9 కి పెరిగింది. కానీ ఈ సంతోషకరమైన పరిణామం రాత్రికి రాత్రే వారికి సరికొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది. నలుగురు ఆడపిల్లలు పుట్టడం తల్లిదండ్రులుగా తాము మర్చిపోలేని ఆశీర్వాదమని ఆ దంపతులు అన్నారు. అయితే వారిని సంరక్షించేందుకు ఆర్థిక వనరులు అవసరమని, ముఖ్యంగా డైపర్లు, పాలు, బట్టలు లాంటి రోజువారీ ఖర్చులు ఊహించని భారమేనని ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి నలుగురు నవజాత శిశువులను పోషించేందుకు స్నేహితులు, అభిమానులు చాలా సాయంగా నిలిచారని తెలిపారు. మరికొంత మంది కూడా ఆ దంపతులపట్ల ప్రశంసలు కురిపిస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. 10 ఏళ్ల బాలుడిని చితకబాదిన పోలీసులు



**ఢిల్లీ:** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (ఆధ్వర్యంలో సోమవారం ఛలో సంసద్ పేరుతో సెంట్రల్ ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ హింసాత్మకంగా మారింది. నిరసనకారులు పార్లమెంట్ చుట్టూ ఉన్న బారికేడ్లను దాటడానికి ప్రయత్నించడంతో భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించి లాఠీచార్జ్ చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఆందోళన కారులతో జంతర్ మంతర్ యుద్ధభూమిని తలపించింది. అయితే ఆందోళనల సమయంలో ఢిల్లీలో పోలీ సులు అమానవీయంగా ప్రవర్తిం చారు. నిరసన కారులపై లాఠీ చార్జ్ చేయడమే కాకుండా 10 ఏళ్ల బాలుడిని(10–సైతం కొట్టడంతో పలువు రు ఆందోళన కారులు ఆగ్రహం వ్యక్తం చేశా రు. కనీసం పిల్లలు అని చూడా కూడా చేయి చేసుకోవడమేంటని పోలీసుల తీరును పలువు రు తీవ్రంగా తప్పుడుతున్నారు. పోలీసులు కొడుతుంటే పరుగులు తీస్తున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## 'విద్యార్థుల వెంటే ప్రభుత్వం- నీట్ పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదటిసారిగా స్పందించారు. ఇది జాతీయ సమస్య అని, దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిట ోరియంలో 'మంగళ్ మిలన్' పేరుతో జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. సమావేశం అనంతరం ఎన్?డీఏ నేతలకు, ఎంపీలకు ప్రధాని మోదీ చేసిన కీలక సూచనలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష పేపర్ లీక్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), దేశ ఆర్థిక పురోగతి తదితర అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.'నీట్ పేపర్ లీక్ జాతీయ సమస్యనీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారని కిరణ్ రిజిజు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల వెంటే నిలుం ్తుందని, ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశమని ప్రధాని పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా, జాతీయ సమస్యగా భావించి పరిష్కరించాలని ప్రధాని



సూచించారని చెప్పారు. పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించినట్లు రిజిజు తెలిపారు. అవసరమైతే న్యాయ నిపుణులతో సంప్రదించి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ పరిధిలో జరిగే పేపర్ లీక్ ఘటనలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాని స్పష్టం చేసినట్లు వెల్లడిం చారు.'మనందరి బాధ్యత అదే'పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలని ప్రధాని మోదీ తెలిపినట్లు కిరణ్ రిజిజు పేర్కొన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించినట్లు తెలిపారు. పిల్లలను రెచ్చగొట్టొద్దని, తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమని అన్నారు. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టమని, వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నట్లు చెప్పారు. నీట్ పరీక్షలో అక్రమాలపై నివేదికలు అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకుందని, కిరణ్ రిజిజు తెలిపారు. ఈ వ్యవహారంలో 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా రీ–ఎగ్జామ్‌ను విజయవంతంగా నిర్వహించి వెంటనే ఫలితాలను సైతం వెల్లడిం చామన్నారు.'రైతుల ప్రయోజనాలే ముఖ్యం'ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఎంతో ఫలవంతంగా జరిగిందని కిరణ్ రిజిజు తెలిపారు. ఇటీవల దేశం సాధించిన విజయాలు, వివిధ దేశాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ప్రధాని, ఎంపీలకు వివరించారని చెప్పారు. వివిధ దేశాలతో కుదుర్చుకున్న ఎఫ్‌టీఏలపై మాట్లాడిన ప్రధాని, రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చినట్లు రిజిజు వెల్లడించారు. ఏ దేశంతో ఒప్పందం కుదుర్చు కున్నా రైతుల సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలే తీసుకుంటామని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన సభ్యులను కూడా సమావేశంలో స్వాగతించినట్లు పేర్కొన్నారు. నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు అవకతవకలు, పరీక్ష రద్దు అనంతరం విద్యార్థుల ఆత్మహత్యల అంశాలపై ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉంటున్నా రంటూ విపక్షాలు విమర్శిస్తూ వచ్చాయి. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని సీజేపీ నిరసనలు చేపట్టింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తోంది.

# ప్రభుత్వ స్థలంలో "క్లారియన్"

## 59 జీవో కింద క్రమబద్ధీకరణకు స్కెచ్.! అధికారులకు బారీగా ముట్టిన నోట్ల కట్టలు. ?

**శేర్లింగంపల్లి : జూలై 21 (పీపుల్స్ న్యూస్)**
శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతి పొందిన స్థలాన్ని ఆధారంగా చేసుకుని, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో కమర్షియల్ భవనం నిర్మించిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. వివరాల ప్రకారం, సర్వే నంబర్ 111లోని ప్రైవేట్ స్థలానికి నివాస గృహ నిర్మాణానికి అనుమతి తీసుకున్న యజమాని, అనంతరం పక్కనే ఉన్న సర్వే నంబర్లు 108, 110లోని సుమారు 3,751 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాణిజ్య భవనాన్ని నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ నిర్మాణం అక్రమమనే అభ్యంతరాలు వ్యక్తమైన తర్వాత, దానిని క్రమబద్ధీకరించేందుకు సంబంధిత వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. అదే సమయంలో జీవో నెం.59 నిబంధనలను ఆశ్రయించి సుమారు రూ.70 లక్షల ఫీజు చెల్లించడం ద్వారా భవనాన్ని రెగ్యులరైజ్ చేసుకునే ప్రయత్నాలు చేయడం స్థానికులను విస్మయానికి గురిచేస్తుంది. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు అధికారులు, సంబంధిత వ్యక్తులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా చూపించే ప్రయత్నాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, ఎంత మేర ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందో గుర్తించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.












ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఈ కమర్షియల్ భవనంపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? లేక రెగ్యులరైజేషన్ పేరుతో అక్రమ నిర్మాణానికి చట్టబద్ధత కల్పిస్తారా? అనే ప్రశ్నలు స్థానికులలో ఉన్నాయి.

ప్రభుత్వ భూమిలో 'క్లారియన్' పేరుతో హోటల్ నిర్మాణం..? అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెందిన స్థలంలో 'క్లారియన్' పేరుతో ఓ హోటల్ నిర్మాణం చేపట్టినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ప్రభుత్వ భూమిని ఆక్రమించి భారీ స్థాయిలో హోటల్ నిర్మాణం చేపట్టినా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారుల సహకారంతోనే ఈ నిర్మాణం కొనసాగుతోందని, అందువల్లే చట్టపరమైన చర్యలు ముందుకు సాగడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించారని, దీంతో భూకబ్జాదారులకు ప్రోత్సాహం లభిస్తోందని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని వారు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగి ఉంటే వెంటనే అక్రమ నిర్మాణాన్ని తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే ఈ అంశంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నీళ్లలో కొలువైన జగన్మాత- బల్కంపేట ఎల్లమ్మ తల్లి మహిమ ఇదే! బోనాల సందర్భంగా జరిగే కల్యాణోత్సవాల విశిష్టత తెలుసా?





సాధారణంగా ఆలయాల్లో అమ్మవారు కూర్చుని లేదా నిలుచుని ఉన్న భంగిమలో దర్శమిస్తుంటారు. కానీ ఈ ఆలయంలో మాత్రం అమ్మవారు జగత్తును చల్లగా కాపాడే తల్లిగా నీళ్లలో కొలువై ఉండి పూజలందుకోవడం విశేషం. ఈ తల్లి శిరసు నుంచి నిరంతరం ప్రవహించే జలాన్ని తీర్థంగా సేవిస్తే మొండి రోగాలు సైతం నయమవుతాయని విశ్వాసం. ఇంతకు ఈ ప్రత్యేకమైన ఆలయం ఎక్కడుంది? ఆలయ విశేషాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.

తెలంగాణలో బోనాలు సందడి

ఆషాఢ మాసం ఆరంభం కాగానే తెలంగాణలో బోనాలు సందడి మొదలవుతుంది. ఈ జాతరలో పాల్గొనడానికి విదేశాల నుంచి కూడా భక్తులు వస్తారంటే ఈ జాతర విశిష్టత ఏమిటో తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జులై 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు హైదరాబాదులోని బల్కంపేట రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో కల్యాణోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. శివశక్తుల కల్యాణంగా ప్రసిద్ధి చెందిన ఈ కల్యాణోత్సవాలు దేశవిఖ్యాతి చెందినవి. ఈ సందర్భంగా జలంలో వెలసిన జగన్మాత ఎల్లమ్మ తల్లి ఆలయ విశేషాలు తెలుసుకుందాం.

అతి ప్రాచీన చారిత్రాత్మక ఆలయం

దాదాపు 700 వందల చరిత్ర కలిగిన బల్కంపేట రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు స్వయంభువుగా కొలువై భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్నారు.

ఆలయ చరిత్ర - స్థల పురాణం

సుమారు ఏడు దశాబ్దాల క్రితం బల్కంపేట ప్రాంతమంతా పచ్చని పంట పొలాలే ఉండేవి. ఒక రైతు తన భూమిలో నీటి కోసం బావిని తవ్వుతుండగా ఆ తవ్వకాలలో అమ్మవారి విగ్రహం బయట పడింది. రైతు అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీయడానికి ఎంత ప్రయత్నించినా వీలు పడలేదు. చివరకు రైతులు, ఊరి వారంతా కలిసి ప్రయత్నించినా కూడా అమ్మవారి విగ్రహాన్ని బావి నుంచి వెలుపలకు తీసుకు రాలేకపోయారు.

బావిలోనే పూజలు

ఇక చేసేదేమీ లేక ఊరివాళ్లంతా బావిలోనే అమ్మవారి విగ్రహాన్ని ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. కాలక్రమంలో ఆలయాన్ని నిర్మించి, ఎంత అభివృద్ధి చేసిన అమ్మవారి విగ్రహాన్ని మాత్రం బావిలోనే ఉంచి పూజించసాగారు. ఇందుకు బదులుగా పైన మరో అమ్మవారిని ప్రతిష్టించి పూజించసాగారు. అనతి కాలంలోనే రేణుక ఎల్లమ్మ మహిమలు చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించడంతో భక్తులు తండోపతండాలుగా రావడం మొదలు పెట్టారు. ఇక అక్కడ అమ్మవారి కోసం ఓ చిన్న ఆలయం వెలసింది.

బల్కంపేట పేరు ఇలా వచ్చింది

రాజా శివరాజ్ బహద్దూర్ అనే సంస్థానాధీశుడి హయాంలో 'బెహలూఖాన్ గూడా'గా పిలువబడిన ఈ ప్రాంతం, తరువాతి కాలంలో బల్కంపేటగా మారిపోయింది. ఎల్లమ్మ తల్లి 'బల్కంపేట ఎల్లమ్మ'గా సుప్రసిద్ధురాలైంది. 1919లో ప్రస్తుతం ఉన్న దేవాలయ నిర్మాణం జరిగింది.

బోనాలు సందడి

భాగ్యనగరంలో ప్రతి ఆషాఢంలో బోనాలు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా ఆషాఢ మాసం ప్రారంభమైన మొదటి మంగళవారం రోజు రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం వైభవంగా జరుగుతుంది. ఈ కల్యాణోత్సవంలో పాల్గొనడానికి దేశవిదేశాల నుంచి దాదాపు లక్షమంది వరకు భక్తులు విచ్చేస్తారు.

కమనీయం ఎల్లమ్మ తల్లి కల్యాణం

ఆషాఢ మాసంలో తొలి మంగళవారం రోజు బల్కంపేట ఆలయంలో ఎల్లమ్మ తల్లి కల్యాణం సందర్భంగా శక్తి మాత కళ్యాణం మహాదేవ శివయ్యతో జరిపిస్తారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వారు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ కల్యాణం చూసి తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తుల మనోభీష్టాలు నెరవేరుతాయని నమ్మకం. అమ్మవారి కల్యాణం చూసి అక్షింతలు శిరస్సున వేసుకుంటే అవివాహితులకు శీఘ్రంగా వివాహం జరుగుతుందని విశ్వాసం, అంతే కాదు అమ్మవారి కల్యాణం కళ్లారా చూసిన వారికి అనేక శుభాలు చేకూరుతాయని విశ్వాసం.

కల్యాణం విశేషాలు ఇవిగో

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవాల్లో భాగంగా జూలై 20, సోమవారం ఎదురుకోలు ఉత్సవం జరుగుతుంది. జూలై 21, మంగళవారం రోజు కల్యాణం జరుగుతుంది. జూలై 22, బుధవారం రోజు రథోత్సవం, బోనాలు వైభవంగా సాగుతాయి.

ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు

రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవంలో భాగంగా ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ అధికారులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

మహా తీర్థంతో రోగాలు మటుమాయం

బల్కంపేట ఆలయంలో అమ్మవారి స్వయంభూ మూర్తి శిరసు భాగం వెనుక నుంచి నిత్యం జలధార ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పవిత్ర జలాన్నే భక్తజనం మహా తీర్థంగా స్వీకరిస్తారు. ఆ నీటితో ఇళ్లను శుద్ధి చేసుకుంటే భూతప్రేత పిశాచాది దుష్టశక్తులు పారిపోతాయని భక్తుల విశ్వాసం. నిత్యం స్నానం చేసే నీళ్లల్లో ఈ మహా తీర్థాన్ని కలుపుకొని స్నానం చేస్తే భయంకరమైన చర్మ వ్యాధులు కూడా తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

నెలరోజులు బోనాలు ఉత్సవాలు

## అమ్మవారికి బోనం ఎందుకు సమర్పిస్తారు? దీని విశిష్టత ఏమిటో మీకు తెలుసా?





తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ బోనాలు పండుగ. ఆషాఢ మాసం ఆరంభం కాగానే తెలంగాణలోని నగరాల నుంచి, మారుమూల గ్రామాల వరకు జాతర కళతో నిండిపోతాయి. పల్లెల్లో, పట్టణాల్లో వయో లింగ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకునే బోనాలు జాతర గురించిన ప్రత్యేక విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

బోనాలు అంటేబోనాలు తెలంగాణ రాష్ట్రం అత్యంత వైభవంగా జరుపుకునే సాంస్కృతిక జాతర. ఆషాఢ మాసంలో మహంకాళి, పోచమ్మ, ఎల్లమ్మ, రేణుక ఎల్లమ్మ, గండి మైసమ్మ మొదలైన గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో బోనం అంటే నైవేద్యం సమర్పించి, అంటువ్యాధులు రాకుండా కాపాడమని అమ్మవారిని ప్రార్థిస్తారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బోనాలు జాతర తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. 'భోజనం' అనే పదానికి మరో రూపమే బోనం. ఒకప్పుడు తెలంగాణ ప్రాంతంలో ప్రబలిన ప్లేగు మహమ్మారిని అమ్మవారు పారద్రోలిందంట! అందుకు కృతజ్ఞతగా అమ్మవారికి బోనాలు సమర్పించే ఆచార అనాదిగా కొనసాగుతోంది.

బోనాలు విశిష్టత

సాధారణంగా తెలుగువారి సంప్రదాయం ప్రకారం కొత్తగా పెళ్లైన అమ్మాయి ఆషాఢ మాసంలో పుట్టింటికి రావడం అనాదిగా వస్తున్న ఆచారం. అయితే నిత్య పెళ్లికూతురైన అమ్మవారు ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పుట్టింటికి వస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ మాసం మొత్తం పుట్టింటికి వచ్చే శక్తి స్వరూపిణికి ప్రేమతో, భక్తి శ్రద్ధలతో బోనంతో పాటు సారెను కూడా సమర్పించడం వలన ఆ తల్లి తన చల్లని చూపులతో అనుగ్రహిస్తుందని విశ్వాసం. అంతేకాదు అమ్మవారికి బోనాలు సమర్పించడం వలన ఈ కాలంలో ప్రబలే అంటువ్యాధుల నుంచి ఆ జగదాంబిక రక్షించి ఆయురారోగ్యాలు ప్రసాదస్తుందని విశ్వాసం.

బోనాలు వేడుకలు షురూ ఇలా

తెలంగాణ ప్రజలు అత్యంత భక్తి విశ్వాసాలతో జరుపుకునే బోనాలు వేడుకలు తొలుత గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో మొదలవుతాయి. అటు తర్వాత వరుసగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో, లాల్ దర్వాజా సింహవాహిని ఆలయాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక అమ్మవారి ఆలయాల్లో ఘనంగా జరుగుతాయి. చివరగా గోల్కొండ కోటలోనే ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఈ ఏడాది బోనాలు షెడ్యూల్ ఇదే!

జులై 16, గురువారం: రోజున చారిత్రాత్మక గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయంలో బోనాలు ప్రారంభం కానున్నాయి.

జూలై 19, ఆదివారం: గోల్కొండ కోటలో జగదాంబిక అమ్మవారి ఆలయంలో తొలి బోనంతో ఉత్సవాలు ప్రారంభం మరియు లష్కర్ బోనాలు ఘటోత్సవం జరుగుతాయి.

ఆగస్టు 2, ఆదివారం: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ప్రధాన లష్కర్ బోనాలు.

ఆగస్టు 3, సోమవారం: లష్కర్ బోనాల్లో అత్యంత కీలకమైన 'రంగం' మరియు అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు జరగనున్నాయి.ఆగస్టు 9, ఆదివారం: పాతబస్తీ లాల్ దర్వాజ మరియు ఇతర ఉమ్మడి దేవాలయాలలో బోనాలు ఉత్సవాలు జరుగుతాయి.ఆగస్టు 10, సోమవారం: ఘటాల ఊరేగింపుతో బోనాల జాతర ముగింపు.

ఉత్సాహంగా జాతర

బోనాల ఉత్సవాలు జరిగిన్నని రోజులు ప్రతి ఆది, సోమ, గురువారాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. డప్పుల మోతలు, గజ్జెల సవ్వళ్లు, పోతురాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా జరిగే బోనాల ఉత్సవాలు చూడటానికి రెండు కళ్లు సరిపోవు. ఇటీవలి కాలంలో విదేశాల్లో కూడా బోనాలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటే ఈ ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించవచ్చు. మనం కూడా ఈ ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పిద్దాం. బోనాలు జాతరలో పాల్గొని అమ్మవారి అనుగ్రహంతో ఆయురారోగ్య ఐశ్వర్యాలను పొందుదాం.

జై జగదాంబిక తల్లి! జై ఎల్లమ్మ తల్లి! జై పోచమ్మ తల్లి!

ఓం శ్రీ మాత్రే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

## శ్రీకృష్ణుడికి ఒక్క నమస్కారం ఎంత విలువైందో తెలుసా? - రోజూ చేశారంటే ఎంతో ఫలం అంటున్న పండితులు!



దేవుడికి, గురువులకు, పెద్దలకు నమస్కారం చేస్తుంటాం. మనలో ఉన్న అహంకారాన్ని తగ్గింపజేసి, పరమాత్మ భావాన్ని అంతటా దర్శించడమే నమస్కారంలో ఉన్న అంతరార్థం అని ఆధ్యాత్మిక ప్రవచనకర్త మాచిరాజు కిరణ్ కుమార్ తెలిపారు. మన సంప్రదాయంలో నమస్కారానికి ఉన్న ప్రాధాన్యత ఏంటి? అవి ఎన్ని రకాలు? రోజూ శ్రీకృష్ణుడికి నమస్కారం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.సంప్రదాయ గ్రంథాల ప్రకారం నమస్కారమునకు ఉన్న ప్రాధాన్యతను పరిశీలిస్తే, నమస్కారము అంటే 'నేను నీకంటే తక్కువ వాడిని, నేను నీకు దాసుడిని' అని అర్థం. మనలో ఉన్నటువంటి అహంకారాన్ని తగ్గింపచేసుకుని పరమాత్మ భావాన్ని అంతటా దర్శించడమే నమస్కారంలో ఉన్న అంతరార్థం. అందుకే ధర్మశాస్త్ర గ్రంథాలు ఏం చెబుతాయంటే, అనేక వేల అశ్వమేథ యాగాలు చేసిన తర్వాత అవభృథ స్నానం అని ఒక ప్రత్యేక స్నానమాచరిస్తారు. ఆ అవభృథ స్నానం అనేది కొన్ని కోట్ల జన్మల పాపాలన్నీ పటాపంచలు చేస్తుందట.

రోజూ శ్రీకృష్ణుడిని పూజిస్తే

అవభృథ స్నానం అనే ప్రత్యేక స్నానం ఎంతటి అద్భుత ఫలితాలను కలిగింపజేస్తుందో శ్రీకృష్ణ పరమాత్మకు ఒక్క నమస్కారం చేస్తే అది అంతటి అద్భుత ఫలితాలను కలిగింపజేస్తుందని ప్రామాణిక గ్రంథాలన్నీ తెలియజేస్తున్నాయి. అందుకే, రోజూ తప్పకుండా శ్రీకృష్ణ పరమాత్మకు ఒక్క నమస్కారం చేసుకుని మన కార్యక్రమాలను ప్రారంభించినట్లయితే అద్భుతమైన శుభ ఫలితాలను సిద్ధింపచేసుకోవచ్చంటున్నారు ఆధ్యాత్మికవేత్త మాచిరాజు. గురువులు, పెద్దలు, ఎవరు కనిపించినా సరే నమస్కరించడం ద్వారా విప్రయోజనాలు చేకూరతాయంటున్నారు.

నమస్కారం ఎన్ని రకాలంటే?

నమస్కారం అనేది 'కాయికం, వాచికం, మానసికం' అని మూడు రకాలుగా ఉంటుంది. కాయికం అంటే శరీరంతో చేసే నమస్కారం అని అర్థం. వాచకం అంటే మాటతో చేసే నమస్కారం. ఇక మానసికం అంటే మనసులో ఎదుటివారికి నమస్కారం చెప్పుకోవడం. వీటిల్లో ఏ నమస్కారమైన ఉత్తమ ప్రయోజనాలను కలిగింపజేస్తుందంటున్నారు జ్యోతిష్యులు మాచిరాజు.మన సంప్రదాయ గ్రంథాల్లో 'కాయికం' అనే నమస్కారాన్ని మళ్లీ నాలుగు రకాలుగా చెప్పారు. అవేంటంటే, ఏకాంగ నమస్కారం, త్రయాంగ నమస్కారం, పంచాంగ నమస్కారం, సాష్టాంగ నమస్కారం.

ఏకాంగ నమస్కారం అంటే ఏమిటంటే, ఎవరైనా పెద్దలు కానీ, గురువులు కానీ కనిపించినప్పుడు కేవలం శిరస్సు వంచి నమస్కారం చేయడం. ఇది కూడా ఉత్తమ ఫలితాలను కలిగింపజేస్తుందంటున్నారు.


త్రయాంగ నమస్కారం అంటే ఏమిటనగా, పెద్దలు, గురువులు కనిపించినప్పుడు శిరస్సు వంచి రెండు చేతులు శిరస్సు మీద ఉంచి చేసే నమస్కారం. అయితే, ఏకాంగ నమస్కారం, త్రయాంగ నమస్కారం కంటే పంచాంగ నమస్కారం, సాష్టాంగ నమస్కారం అద్భుతమైన శుభఫలితాలను కలిగింపజేస్తాయని చెబుతున్నారు.పంచాంగ నమస్కారం విషయానికొస్తే, శిరస్సు, రెండు చేతులు, రెండు భుజాలు మోకాళ్ల మీద ఉంచి మోకాళ్ల మీద చేసే నమస్కారంను 'పంచాంగ నమస్కారం' అనే పేరుతో పిలుస్తారు."పూజ" చేసేటప్పుడు నేల మీద కూర్చోకూడదంటారు ఎందుకు? - మరి ఎలా చేస్తే మంచి ఫలితాలు?సాష్టాంగ నమస్కారం అంటే ఏమిటంటే, రెండు చేతులు, రెండు భుజాలు, శిరస్సు, గడ్డం, రెండు చెవులు వీటన్నింటిని కూడా నేల మీద ఉంచి మోకరిల్లి చేసే నమస్కారాన్ని "సాష్టాంగ నమస్కారం" అంటారు. అన్ని నమస్కారాల కంటే ఇది చాలా శక్తివంతమైనది, గొప్పదిగా చెబుతారు.

శరీరంలో ఉన్నటువంటి ఎనిమిది అవయవాలతో చేసే నమస్కారం అని అర్థం. పెద్ద పెద్ద గురువులకు, దైవానికి సాష్టాంగ నమస్కారం చేస్తే ఫలితం అనేది చాలా అద్భుతంగా ఉంటుంది. అయితే, పురుషులు మాత్రమే సాష్టాంగ నమస్కారం చేయాలి. స్త్రీలు ఈ నమస్కారం చేయరాదు. మహిళలు పంచాంగ నమస్కారం మాత్రమే చేయాలి. ఎటువంటి నమస్కారం చేయటానికి వీలుకానీ పక్షంలో అంజలి బంధం చూపించాలని చెబుతున్నారు జ్యోతిష్యులు మాచి రాజు. దేవాలయానికి వెళ్లినప్పుడు అక్కడ భగవంతుడే గొప్పవాడు. అందుకే, దేవాలయంలో పెద్ద పెద్ద గురువులు, పీఠాధిపతులు దేవాలయంలో కనిపించినప్పటికీ అక్కడ వారికి సాష్టాంగ నమస్కారం చేయకూడదు. దేవాలయం దాటి బయటకు వచ్చాకే వారికి సాష్టాంగ నమస్కారం చేయాలి. అటువంటప్పుడు దైవస్వరూపమైనవారు, పీఠాధిపతులు, గురువులు, యతులు దేవాలయంలో కనిపించినప్పుడు వాళ్లకి అంజలి బంధం చూపించాలి.

అంజలి బంధం అంటే ఏమిటంటే, అరచేతులను పూర్తిగా మూసి ఉంచకుండా కొద్దిగా ఓపెన్ చేసి ఉంటే దాన్ని అంజలి బంధం అంటారు. అలా అంజలి బంధంతో గురువులకు నమస్కార భావన చూపించినట్లయితే నీ పట్ల నేను దాసుడిగా ఉన్నాననే అర్థం వస్తుంది.

అలాగే, ఎప్పుడైనా సరే గురువుల పాద పద్మాలకు నమస్కరించేటప్పుడు లేదా పెద్ద పెద్ద వారి పాద పద్మాలకు నమస్కరించేటప్పుడు మన కుడి చేయి వారి కుడి పాదం మీద, ఎడమ చేయి ఎడమ పాదం మీద ఉండాలి. అలా ఉంచేటప్పుడు కూడా కుడి చేయి పైన ఉండాలి. ఎడమ చేయి కింద ఉండాలి. ఆవిధంగా చేతులను ఉంచి నమస్కారం చేసినట్లయితే దాని వల్ల గురువుల సంపూర్ణమైన అనుగ్రహం కలుగుతుంది. గురు బలాన్ని పెంపొందింపచేసుకోవచ్చంటున్నారు . ఇలా మీరూ నమస్కారంలో ఉన్న ప్రత్యేక విధివిధానాలు పాటిస్తూ నమస్కార భావనతో మెలగండి. అంతటా ఉన్నటువంటి భగవంతుడి

## ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి కోల్పోతుందా? - నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచే మార్గాలు ఇవేనట!



ఒత్తిడి తీవ్రమైతే నాడీ వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. దీంతో మనసు ఉద్రిక్తంగా మారుతుంది. శరీరం విశ్రాంతిని కోల్పోతుంది. ఈ క్రమంలో నాడుల స్పందనను నెమ్మదింపజేయడానికి ఎన్నో పరిష్కారాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

ఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, ఆందోళన తరచూ శరీరంలో మొదలవుతుంది కానీ, మనసులో కాదు. ఇది నాడీ వ్యవస్థను శాంతపరచడం ద్వారా జరుగుతుంది. కాబట్టి, మన ఆలోచనల్ని దానిపై మళ్లించడం, శ్వాసను గమనించాలి. అలాగే, నేలపై మన పాదాలను అనుభూతి చెందడం, చుట్టూ ఉన్న పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి. ఇది మిమ్మల్ని ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, వర్తమానంలోకి తీసుకురావడానికి సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా, ఒత్తిడి తగ్గుతుందంటున్నారు.మానసిక స్థితిని అర్థం చేసుకోవడం : నాడీ వ్యవస్థ ఎప్పుడు ఉత్తేజితమవుతుందో మొట్టమొదట గుర్తించాలి. 'ఇప్పుడు నా శరీరంలో ఏం జరుగుతోంది? నేను కోపంగా, అశాంతితో లేదా ఆందోళనగా ఉన్నానా? అని మనల్ని మనం ఆత్మావలోకనం చేసుకోవాలి. ఇలా చేస్తే ప్రతిచర్య, ప్రతిస్పందన మధ్య ఓ విరామాన్ని సృష్టించి ఒత్తిడిని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు

"ప్రెగ్నెన్సీ"లో నిద్ర పట్టడం లేదా? - ఇలా చేస్తే మంచిదట!వేగాన్ని తగ్గించుకోవడం : ఒత్తిడి, ఆందోళన అత్యవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతి పని ముఖ్యమైనదిగా అనిపిస్తుందట. మన నాడీ వ్యవస్థ వేగానికి ప్రతిస్పందిస్తుంది. కాబట్టి, కదలికలు, మాటలు, శ్వాసను నెమ్మదిగా చేయడం ద్వారా మనం సురక్షితంగా ఉన్నామని శరీరానికి సంకేతం పంపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.మనం తరచూ ఒత్తిడి, ఆందోళనకు గురైనట్లు లేదా విశ్రాంతి లేనట్లుగా కనిపిస్తే, ఈ స్థితిలో ఎక్కువ సేపు గడిపామని దానర్థం. ఇలాంటప్పుడు ఒత్తిడి, ఆందోళన ఎక్కడ మొదలైందో ఆలోచించాలి. నాడీవ్యవస్థ స్తంభించడానికి కారణాలను తెలుసుకోవాలి. నాడీవ్యవస్థను నియంత్రించుకోవాలి. అంటే, మన శరీరం ప్రశాంతంగా ఉండటానికి తగినంత సురక్షితంగా భావించేలా సహాయపడాలి. - ఒవెన్ ఓ కెన్, బ్రిటన్?కు చెందిన సుప్రసిద్ధ మనోవైద్య నిపుణుడు

అంతర్గత సంఘర్షణకు చెక్ : ఒత్తిడి భావనను ప్రతిఘఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, టించడానికి బదులుగా దాన్ని అనుమతించాలట. మన భావాలతో పోరాడినప్పుడు మరో పొర ఉద్రిక్తతను జోడించినట్లు లెక్క. ఆందోళనకు అడ్డుపడకుండా ఉండే అది అంతర్గత సంఘర్షణను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ కుదుటపడటానికి సహాయపడుతుందని అంటున్నారు.

బ్రేక్ తీసుకోవడం : ఒత్తిడి వలయంను ముందుగానే నిలువరించాలట. మనం తీసుకునే చిన్న బ్రేక్ కూడా ఈ వలయం తీవ్రం కాకుండా ఆపగలదు. ఈ క్రమంలో ఒత్తిడి సంకేతాలను ఎంత ముందుగా గమనిస్తే, స్పందన అంత సువుతుందని నిపుణులు సూచిస్తున్నారు.రోజువారీ అలవాట్లలో మార్పులు : రోజులో సురక్షితమైన క్షణాలను సృష్టించుకోండి. మన నాడీవ్యవస్థ నిరంతరం సంకేతాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఏ విధమైన ఆటంకాలు లేకుండా కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం, కొద్దిసేపు నడవడం, నిరంతర సమాచార ప్రసారానికి దూరంగా ఉండటం క్రమం తప్పకుండా చేసినప్పుడు, చిన్న విరామాలు కూడా ఆందోళన నుంచి ఉపశమనానికి తోడ్పడతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఒత్తిడిలో ఓ సాధారణ ధోరణ ఏమిటంటే, మనం అనుకున్న రీతిలో దాన్ని పరిష్కరించాలనుకోవడం. కానీ ఇది తరచుగా మరింత ఒత్తిడిని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ఆందోళన అనేది మానవ సహజమని, దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు.

శరీరం సహజ ప్రతిస్పందన : ముప్పును పసిఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, గట్టినపుడు శరీరం సహజంగానే పోరాటమైనా చేస్తుంది లేదా పలాయన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ సమయంలో వేగవంతమైన శ్వాస, కండరాలు బిగువుగా మారడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అప్రమత్తం కావడం లాంటివి ఉండొచ్చంటున్నారు నిపుణులు. ఇవన్నీ మనల్ని మనం రక్షించుకోవడానికి ఉద్దేశించినవట. కానీ, మన నాడీ వ్యవస్థ వాస్తవ ప్రమాదానికి, ఆందోళనకరమైన ఆలోచనలకు మధ్య తేడాను ఎల్లప్పుడూ గుర్తించదు. కాబట్టి, రోజువారీ ఒత్తిడి కూడా పోరాటం లేదా పలాయనం ప్రతిస్పందనను ప్రేరేపించొచ్చుట. మనం పోరాటం లేదా పలాయన స్థితిలో చిక్కుకుపోయినట్లు భావిస్తే, దాని నుంచి బలవంతంగా బయటకు రావడం లక్ష్యం కాకూడదని నిపుణులు చెబుతున్నారు. దానికి బదులుగా, శరీరానికి సున్నితంగా భద్రతా సంకేతాలు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.: ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# విద్యుత్ షాక్ తోవ్యక్తిమృతి



**పాపన్నపేట,జూలై,21,**
వంండలవరిధిలోనిపొడ్చన్‌వల్లి గ్రామంలోమంగళవారం ఉదయం విషాదకర సంఘటనచోటుచేసుకుంది. ఇంటివద్దసంపు నుంచిట్యాంక్‌కునీటినిఎక్కించేప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై గ్రామ సర్పంచ్ వెంకటయ్య (ఏసు) తండ్రి ఏరోళ్లకిష్టయ్య (56)మృతిచెందారు. పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, ఏరోళ్లకిష్టయ్య మంగళవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న సంపు నుంచి మోటారు ద్వారాఇంటిపై ఉన్నట్యాంక్‌కు నీటినిఎక్కించేప్రయత్నంచేస్తుండగా, వర్షంకారణంగా తడివాతావరణం లోప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యారు.ఈ విషయం గమనించిన కుటుంబికులు వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికిచేరుకునిపరిశీలించి.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంమెదక్‌ఏరియాఆస్పత్రికితరలించి, కుటింబికుల పిర్యాదుమేరకుకేసునమోదుచేసిదర్యాప్తు చేపట్టారు. కాగామృతుడికిభార్యకమలమ్మ, వివాహంఅయినఇరువురు కుమార్తెలు, స్థానిక సర్పంచ్ ఏసు కుమారుడు ఉన్నారు.

# కుర్తివాడలో అక్రమ ఇసుక నిల్వలు గుర్తింపు--154 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక సీజ్




**పాపన్నపేట,జూలై,21,**
మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏడీ మైన్స్, ఆర్ఐ–ఏడీ మైన్స్ పాపన్నపేట రెవిన్యూ అధికారులు పోలీసు సిబ్బంది సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో గ్రామంలోని 29 వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. మొత్తం 154 ట్రాక్టర్ ట్రిప్పులకు సమానమైన ఇసుక అక్రమంగా నిల్వ చేసినట్లు ఏడీ మైన్స్ అధికారులు అంచనా వేశారు.గుర్తించిన ఇసుకను అధికారులు సీజ్ చేసి, కుర్తివాడ గ్రామ పాలనాధికారి(జీపీవో) ఆధీనంలో ఉంచారు. అక్రమ ఇసుక నిల్వలపై తదుపరి చర్యలు మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం చేపడతామని అధికారులు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి: కాట శ్రీనివాస్ గౌడ్






**పటాన్‌చెరు, జూలై 21:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమంపై బీఎల్‌ఏ సూపర్వైజర్లతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కోఆర్డినేటర్లు నాగరిగారి ప్రీతం, గూడూరు శ్రీనివాస్ పాల్గొని.. క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ చేపడుతున్న ఎన్యూమరేషన్, ఫారమ్‌ల నింపుదల, ఓటర్ల వివరాల సేకరణ, అలాగే ఇతర కార్యాచరణల పురోగతిపై సమీక్ష జరిపారు. ఫీల్డ్ స్థాయిలో సూపర్వైజర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు.“ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎటువంటి పొరపాట్లు లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలి. అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో కచ్చితంగా నమోదయ్యేలా బీఎల్‌ఏ సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలి.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీఎల్‌ఏ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.







**మెదక్,జూలై,21,**
మంగళవారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు మరియు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అన్ని జిల్లాలలో వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలంలోగా పూర్తి చేయాలని తెలిపారు.అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన ఆన్లైన్ పూర్తి చేయాలని తెలిపారు.అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాల వారీగా పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ,భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యువరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను 83 % శాతం పూర్తి చేశామని, నిర్ణీత వ్యవధిలోనే అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తామని తెలిపారు. గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిచేసే విధంగా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి,నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ , ఎన్నికల సూపరిడెంట్ పాల్గొన్నారు.

# మీ సేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్.

**- అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు:**
**- ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్**
**- తప్పుగా డాక్యుమెంట్లు అప్లోడ్ చేసినా చర్యలు --**
**- ఇకపై మీ సేవలో డిజిటల్ రశీదులు**



**మెదక్,జూలై,21**
మెదక్ జిల్లా పరిధిలోని పలు మీ సేవ కేంద్రాలను ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన (ఎస్ ఎస్ సి) మెమో ప్రింట్, యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయేతర మార్కెట్ విలువ తదితర సేవలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు.ప్రతి దరఖాస్తును అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని,తప్పుగా డాక్యుమెంట్లు అప్లోడ్ చేస్తే సంబంధిత ఆపరేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.కులం,ఆదాయం, నివాసం, జనన, మరణం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ, గ్యాప్, నాన్–క్రీమీ లేయర్ వంటి సర్టిఫికెట్లను అవసరమైనన్ని సార్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మీ సేవ కేంద్రాలు పనిచేయాలని, ఆపరేటర్లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి మీ సేవ, భూభారతి సహా అన్ని ఆన్‌లైన్ సేవలను సమర్థంగా అందించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సిటిజన్ చార్టర్, భూభారతి ఫ్లెక్సీలు, మీ సేవ లోగోతో పాటు తహసీల్దార్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, పరిష్కారం కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.కళ్యాణలక్ష్మి,యూడీఐడీ (సదరం), జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు.ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ నాణ్యమైన సేవలు అందించాలని ఆపరేటర్లకు సూచించారు.నిర్ణీత ప్రభుత్వ రుసుము కంటే అధికంగా వసూలు చేసినట్లు తేలితే సంబంధిత మీ సేవ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పౌర సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు పూర్తి ఆన్‌లైన్, కాగిత రహిత విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు.గ్రామ పాలనాధికారులు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయని,దరఖాస్తుల స్వీకరణ నుంచి తహసీల్దార్ ఆమోదం వరకు మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే కొనసాగుతుందని వివరించారు.కొత్త విధానం ప్రకారం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసిన వెంటనే దరఖాస్తుదారుడి నమోదిత మొబైల్ నంబర్‌కు డిజిటల్ రశీదు (ఎస్ఎంఎస్) అందుతుందని తెలిపారు. అందులో అప్లికేషన్ నంబర్, సేవ పేరు, చెల్లించిన ఫీజు వివరాలు, రశీదు డౌన్‌లోడ్ చేసుకునేందుకు హైపర్‌లింక్ ఉంటుందని చెప్పారు.ఆ లింక్ ద్వారా రశీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చని తెలిపారు.ఈడిజిటల్ విధానం వల్ల కాగితపు రశీదులు పోగొట్టుకునే సమస్య ఉండదని, అవసరమైతే అదే సందేశాన్ని మళ్లీ పంపించుకునే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ వెల్లడించారు.ఈతనిఖీల్లో పలువురు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు

# చిన్నారుల అశ్లీల వీడియోల కేసులో యువకుడికి ఏడాది జైలు

**- రూ.50 వేల జరిమానా విధించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**
**- చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**
**- సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్ ప్రచారం చేస్తే కఠిన చర్యలు**
**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్**




**మెదక్,జూలై,21**
చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను షేర్ చేయడం, సర్క్యులేట్ చేయడం వంటి నేరాలకు పాల్పడిన తూప్రాన్‌కు చెందిన అరిగే శివకుమార్ (20) కు పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. తూప్రాన్ పట్టణానికి చెందిన శివకుమార్ డిగ్రీ చదువుతున్నాడు. చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను షేర్ చేస్తున్నాడనే అనుమానంతో పోలీసులు అతడి ఫోన్‌ను పరిశీలించగా, ఒక వ్యక్తి పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను సృష్టించి ఇతరులకు అశ్లీల కంటెంట్‌ను పంపుతున్నట్లు గుర్తించారు. సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో ఐపీ అడ్రస్, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని గుర్తించారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం 12 మే 2026 న కేసు నమోదు చేయగా, అప్పటి ఐఓ, తూప్రాన్ సీఐ రంగకృష్ణ దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి సుభావాలి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను చూడడం, కలిగి ఉండడం, షేర్ చేయడం, సర్క్యులేట్ చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ అసభ్యకరమైన, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్రచారం చేసే వారిని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసి, న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు.చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు ఎక్కడైనా గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

# మాదారంలో 95 శాతం పూర్తయిన ఎస్ఐఆర్ ప్రక్రియ

**- గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ - బోయిని రాములు**



పరిగి, జులై 22 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు మాదారం సర్పంచ్ బోయిని రాములు తెలిపారు. పరిగి మండలం మాదారం గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 95 శాతం పూర్తి కావడం అభినందనీయమని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బోయిని రాములు అన్నారు. ప్రక్రియను అత్యంత వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేసిన బిఎల్ఓలు, బిఎల్ఏల, కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడానికి సహకరించిన గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ?ఈ సందర్భంగా బోయిని రాములు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని మాదారంలో సిబ్బంది ఎంతో బాధ్య తాయుతంగా నిర్వహించారు. ప్రతి ఓటరు వివరాలను సరిచూస్తూ 95% ప్రక్రియను పూర్తి చేయడం పట్ల సంతోషంగా ఉంది. మిగిలిన ఐదు శాతం పనిని కూడా త్వరలోనే పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ?ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన యువత తప్పకుండా తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తున్న బిఎల్ఓలు, బిఎల్ఏలకు ఆయన గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థుల తలలు పగలగొట్టడమే బిజెపి లక్ష్యమా..

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి**

**- రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు శ్రీకాంత్**

పరిగి, జూలై 22

భగత్ సింగ్ వారసులుగా ప్రాణాలు పోయినా సరే విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతాం.. ఎన్ని లాఠీఛార్జ్‌లు చేసినా విద్యార్థి ఉద్యమాలు ఆగవని రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కేంద్ర ప్రభుత్వ తీరుకు మంగళవారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ఆందోళన చేపట్టడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్-యూజీ పరీక్షల అక్రమాలను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రూరత్వానికి ఒడిగట్టిందని ఎస్ఎఫ్ఐ మండిపడింది.




విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి తలలు పగలగొట్టడం, బాష్పవా యువు ప్రయోగించి భయానక వాతావరణాన్ని సృష్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేసి నిరసనలను అణచివేయలేరని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అనంతగిరిపల్లిలో కోట్ల విలువైన 'గ్రామకంఠం' స్వాహా..

**- తహసిల్దార్‌కు సీపీఎం, అంబేద్కర్ యువజన సంఘం ఫిర్యాదు**

**- కబ్జాదారులపై చర్యలు తీసుకోకుంటే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తాం**

**- సంబంధిత అధికారులకు ప్రజాసంఘాల హెచ్చరిక**



వికారాబాద్, జూలై 22:

గ్రామకంఠం భూమి కబ్జా చేసిన కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే స్పీకర్ క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించిన సిపిఎం, అంబేద్కర్ యువజన సంఘం, రైతు సంఘం నాయకులు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి 20వ 10వ వార్డుల మధ్యలో ఉన్న గ్రామకంఠం ప్రభుత్వ భూమిని (104 సర్వే నెంబర్ పక్కన) కొంతమంది అధికార పార్టీ నాయకులు అక్రమంగా కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ అక్రమాలకు పాల్పడు తున్న వ్యక్తులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబే ద్కర్ యువజన సంఘం, సిపిఎం రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం వికారాబాద్ తహసిల్దార్, కు వినతిపత్రం ఇచ్చి ఫిర్యాదు చేయడం జరి గింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఈ భూకబ్జాలపై ఇది వరకే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా విడచెవిన పెట్టడం దారుణ మన్నారు. ?అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామకంఠం భూమిని కాపాడి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే.. వికారాబాద్ ఎమ్మెల్యే, క్యాంపు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం కార్యదర్శి రైతు సంఘం నాయకు లు ఆర్. మహిపాల్ , ?అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వంగూరి అనంత య్య, రండ నర్సింలు, పెద్ద రాములు, పారమటి బుచ్చయ్య, రండ రాజు, వంగూరి రాములు, రండ చంద్రయ్య, కృష్ణ, నర్సిములు, శ్రీనివాస్, నరేష్, సాయన్న, బాలు, చరణ్, నాగరాజు, శేఖర్, బి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ఓ నిందితుడి అరెస్టు



ధారూర్, జూలై 22 :

అధికారుల కళ్ళు కప్పి గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విగ్రహాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించిన ఘటన వికారాబాద్ జిల్లా దారుడు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దారుల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో అక్రమంగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని స్థానికుల నుంచి అందిన ముందస్తు సమాచారం ఆధారంగా దారూరు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గంజాయి విక్రయిస్తున్న దత్తాత్రేయ (20) అనే నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. గంజాయి అమ్మకాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాం. స్థానికుల సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా గంజాయి అమ్మకాలకు సంబంధించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని" ఎస్సై వెల్లడించారు. ?గంజాయి మూలాలను శోధించేందుకు ఈ ముఠా వెనుక ఉన్న మరికొందరిని పట్టుకునేందుకు దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# కలగానే మిగిలిన 'ముదిరాజ్ భవనం'

**- భూమి పూజ చేశారు.. జెండా పాతారు.. నిర్మాణం మరిచారు.**

**- నిధుల జాప్యమా.. లేక మభ్యపెట్టే రాజకీయమా..**

**- పరిగి ఎమ్మెల్యే తీరుపై ముదిరాజ్ ల ఆగ్రహం..**

**- నిధులు కేటాయించే వెంటనే ముదురాజు భవనం నిర్మించాలి..**

**- రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్,**



పరిగి, జూలై 22

అట్టహాసంగా భూమి పూజలు చేయడం, జెండాలు పాతడం.. ఆ తర్వాత నిర్మాణాలు పట్టించుకోకుండా వదిలేయడం నాయకులకు అలవాటుగా మారిందనడానికి వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో నిర్మాణానికి నోచుకోని 'ముదిరాజ్ భవనమే' సజీవ సాక్ష్యమని ఆ వర్గం ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలం కేటాయించి, శంకుస్థాపన చేసి ఇన్ని రోజులైనా ఇప్పటికీ భవన నిర్మాణ పనులు అంగుళం కూడా ముందుకు పడకపోవడంతో పరిగి నియోజకవర్గ ముదిరాజులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్, తెలిపారు.. ముదిరాజ్ భవనం నిర్మాణంపై అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు స్థానిక ప్రజాప్రతినిధుల వైఖరిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణానికి నిధులు మంజూరై పనుల్లో జాప్యం జరుగుతోందా.. లేదా కేవలం ముదిరాజులను మభ్యపెట్టేందుకే స్థలం కేటాయింపుతో సరిపెట్టుకుంటూన్నా రా? అని ముకుందా నాగేశ్వర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓట్ల అవసరం ఉన్నప్పుడు హామీలు గుప్పించడం.. గెలిచాక హడావుడిగా భూమి పూజలు చేసి మభ్యపెట్టడం ప్రజాప్రతినిధులకు అలవాటుగా మారింది" అని ముదిరాజ్ మహాసభ కార్యదర్శి మండిపడ్డారు. భూమి పూజ చేసి ఏడాది కావస్తున్న ముదిరాజ్ భవన నిర్మాణం అంగుళం కూడా ముందుకు పడకపోవడంపై వారు స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఎమ్మెల్యే ఈ 'ముదిరాజ్ భవనం' నాటకానికి తెరలేపారని ఆయన ఆరోపించారు. కేవలం తమ సామాజిక వర్గం ఓట్లను దండుకోవడమే ధ్యేయంగా అట్టహాసంగా భూమి పూజలు చేయడం, జెండాలు పాతి ఆ తర్వాత నిర్మాణాన్ని పూర్తిగా గాలికి వదిలేయడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు.

**– నిధుల జాప్యమా? మభ్యపెట్టే రాజకీయమా?**

?భవన నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయా లేదా? నిధులు వస్తే పనుల్లో ఇంత ఆలస్యం ఎందుకు జరుగుతోంది? అని ముకుందా నాగేశ్వర్ ఘాటుగా నిలదీశారు. ఒకవేళ నిధులు రాకుండానే శంకుస్థాపనల పేరిట హడావుడి చేశారా? లేక కేవలం స్థలం కేటాయింపుతో తమను మభ్యపెట్టాలని చూస్తున్నారా? అని తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. ?"ముదిరాజుల సహనాన్ని తక్కువగా భావించవద్దు. ఓట్ల కోసం వచ్చి కేవలం హామీలతో కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకోం. తక్షణమే ముదిరాజ్ భవన నిర్మాణానికి బడ్జెట్ కేటాయించి పనులు ప్రారంభించాలి. లేకపోతే రాబోయే ఎన్నికల్లో పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముదిరాజులంతా ఏకమై నాయకులకు తగిన గుణపాఠం చెబుతమని రాష్ట్ర ముదిరాజ్ మహా సభ కార్యదర్శి ముకుందా నాగేశ్వర్ హెచ్చరించారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి మూగజీవి బలి.

**- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు**



పూడూర్, జూలై 22

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం గొంగుపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విషాదం చోటుచేస ుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడటంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ?గ్రామ శివారులో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించు కోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఒకవేళ ఆ సమయంలో మేకల కాపరులు, రైతులు, గానీ ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నాం ు.?కళ్లెదుటే పాడి ఆవు మృత్యువాత పడటంతో ఆవు యజమాని మోనాచారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆవులే నమ్ముకుని జీవిస్తున్న ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రూ. ఆర్థిక సహాయం అందించాలని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# యువతను మింగేస్తున్న 'మత్తు' మహమ్మారి

- తల్లిదండ్రులు మేల్కొకపోతే భవిష్యత్తు శూన్యమే..
- పిల్లలు చెడు దారిన పడడానికి తల్లిదండ్రుల నిర్లక్ష్యమేనా?
- మత్తు రహిత సమాజం కోసం ఏకమవ్వాలి..
- పరిగి డీసీఎంఎస్ సంతోష్

పరిగి, జూలై 22 :

నేటి సమాజంలో భావి భారత పౌరులుగా మారాల్సిన యువత, పక్కదారి పడుతూ మత్తు పదార్థాల రొంపిలోకి దిగుతుండటం అత్యంత విచారకరమని, కలవరపెడుతున్న అంశమని పరిగి డీసీఎంఎస్ సంతోష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై, కన్నతల్లిదండ్రులను, సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే మారణ మృగాలుగా యువకులు తయారవుతున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. నేడు యువత మత్తులో ఊగుతూ జీవితాలను నాశనం చేసుకుంటుంటే.. దానికి తల్లిదండ్రుల నిఘా లోపించడం, వారి అలసత్వమే ప్రధాన కారణం అని చెప్పక తప్పదు.. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు. ఎవరితో తిరుగుతున్నారు. వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి. అని గమనించాల్సిన కనీస బాధ్యత తల్లిదండ్రులపై లేదా.. కేవలం డబ్బులు ఇచ్చి, కావలసినవి కొనిచ్చి వదిలేస్తే సరిపోదు. పిల్లల పెంపకంలో పర్యవేక్షణ లేకపోతే, రేపు ఆ పిల్లలే మీ కుటుంబానికి, సమాజానికి శాపంగా మారతారని సంతోష్ తల్లిదండ్రులకు సూచించారు.



**– పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే..**

?రేపటి మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. మత్తు పదార్థాల ముఠాలు మన వీధుల్లోకి జొరబడి, రక్తం పంచుకు పుట్టిన పిల్లల జీవితాలతో ఆడుకుంటుంటే చూస్తూ ఊరుకుందామా? తల్లిదండ్రులు ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. మీ పిల్లల ప్రతి కదలికను కనిపెట్టండి. వారి స్నేహితులు ఎవరు, వారు ఎలాంటి అలవాట్లకు లోనవుతున్నారో గమనించండి. మత్తు రాకాసి బారిన పడకుండా పిల్లలను కాపాడుకోవాల్సిన మొదటి బాధ్యత తల్లిదండ్రులదే. లేదంటే రేపు కన్నీరు మున్నీరుగా ఏడ్చినా ప్రయోజనం ఉండదని సంతోష్ కోరారు.

**– చిల్లర వ్యాపారం ముసుగులో 'మత్తు' దందా..**

చదువుకుని, కష్టపడి పైకి రావాల్సిన వయసులో మన యువకులు టీ కొట్లు, పాన్ డబ్బాల చుట్టూ చేరి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. వ్యాపారులు కేవలం స్వల్ప లాభాల కోసం లేత వయసున్న పిల్లలకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను టీ కొట్లు, పాన్ డబ్బాల వెనుక రహస్యంగా విక్రయిస్తున్నారు. ఇది కేవలం నేరం మాత్రమే కాదు... ఒక తరాన్ని నిలువునా పూడ్చిపెట్టే ఘోరమైన కుట్ర! ఇలాంటి అక్రమ దందాలను చూస్తూ ఊరుకునేది లేదు.

**– మత్తు రహిత సమాజం కోసం ఏకమవ్వాలి..**

గంజాయి విక్రయదారులు, సరఫరాదారులపై పోలీసులు సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సంతోష్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వారి సమాచారాన్ని వెంటనే అధికారులకు అందించాలని పిలుపునిచ్చారు. యువత తమ బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాల కోసం బలి చేయవద్దని, మంచి మార్గంలో నడిచి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన



2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్‌గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్‌కప్‌నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్‌పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు.

పురుషుల హాకీ వరల్డ్‌కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్ (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్ (1975లో) ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన టీమ్‌ఇండియా టైటిల్ ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా 2-1 తేడాతో పాక్‌ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్‌ను సాధించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్‌కప్‌లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్‌కప్‌ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్‌కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకాశం' అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..



టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..తొలి టీ20: జులై 23 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌రెండో టీ20: జులై 25 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌మూడో టీ20: జులై 26 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)

ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్లు జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది.



# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

# స్పెయిన్‌కు సుమారు రూ.430 కోట్ల ప్రైజ్ మనీ

2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఘన ముగింపు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రూథర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆగిపోయాయి. మరోవైపు యువ ఆటగాళ్లతో బలంగా కనిపించిన స్పెయిన్ చరిత్రలో రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో స్పెయిన్‌కు ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత గౌరవంతో పాటు భారీ ఆర్థిక లాభం కూడా దక్కింది. ఫిఫా ప్రకటించిన రికార్డు స్థాయి ప్రైజ్ ఫండ్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్‌కు 50 మిలియన్ అమెరికన్ డాలర్లు లభించనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.430 కోట్లకు సమానం. పురుషుల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో విజేతకు లభించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఫైనల్లో ఓడిపోయినా అర్జెంటీనా ఖాళీ చేతులతో వెళ్లలేదు. రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టుకు 33 మిలియన్ డాలర్లు దక్కనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.284 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ పొందిన మొత్తంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఇంగ్లండ్‌కు 29 మిలియన్ డాలర్లు (సుమారు రూ.249 కోట్లు), నాలుగో స్థానంలో నిలిచిన ఫ్రాన్స్‌కు



27 మిలియన్ డాలర్లు (సుమారు రూ.232 కోట్లు) ప్రైజ్ మనీ లభించనుంది.ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో నేతృత్వంలోని ఫిఫా కౌన్సిల్ 2025 డిసెంబరులో ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 ప్రపంచకప్ కోసం మొత్తం 655 మిలియన్ డాలర్ల ప్రైజ్ ఫండ్‌ను కేటాయించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5,630 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం అధికం. అంతేకాకుండా టోర్నమెంట్‌కు అర్హత సాధించిన ప్రతి జట్టుకు సిద్ధత ఖర్చుల కోసం అదనంగా 1.5 మిలియన్ డాలర్లు కూడా అందజేశారు. అంటే సుమారు రూ.13 కోట్లకు పైగా ప్రతి జట్టుకు ముందుగానే లభించింది. టోర్నమెంట్‌లో వ్యక్తిగత అవార్డుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపే మెరిశాడు. మొత్తం 10 గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అతడు నాలుగు అసిస్ట్‌లు కూడా నమోదు చేశాడు. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచకప్‌తో ఎంబాపే తన కెరీర్ వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 వరల్డ్‌కప్ గోల్స్‌తో ఉన్న మెస్సి రికార్డును అధిగమించిన ఆటగాడిగా నిలిచాడు.ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది. టోర్నమెంట్ మొత్తం స్పెయిన్ ఆటను నియంత్రించడంలో, మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయించడంలో రోడ్రీ కీలక పాత్ర పోషించాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పాస్‌లు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా అతడు రికార్డు సృష్టించాడు. స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో రోడ్రీ ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది.

# ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

## ఓవరాల్ చాంపియన్‌గా మేడ్చల్ మల్కాజ్‌గిరి

హైదరాబాద్ :మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన 11వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్‌జిల్లా స్విమ్మింగ్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. 54 పసిడి పతకాలు, 50 రజత పతకాలు, 26 కాంస్య పతకాలు సాధించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి రాష్ట్ర స్థాయిలో ఓవరాల్‌గా చాంపియన్‌గా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి 472 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 293 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా.. ఆ జిల్లా స్విమ్మర్లు 34 పసిడి, 25 సిల్వర్, 24 కాంస్య పతకాలు కొల్లగొట్టారు.స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు నిలిచిన క్రీడాకారులకు, ఓవరాల్ చాంపియన్‌షిప్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లాలకు తెలంగాణ స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జి ఉమేశ్‌లు బహుమతులు ప్రదానం చేశారు.



## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.



## చరణ్ సరసన రష్మిక?..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



## శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

## పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు. సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

## 'టాక్సిక్' నుంచి రెండో పాట.. యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## 'ఇరుముడి' డబ్బింగ్ ప్రారంభించిన రవితేజ

రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న 'ఇరుముడి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి రవితేజ డబ్బింగ్ ప్రారంభించారు. షూటింగ్‌లో తన భాగాన్ని పూర్తి చేసిన ఆయన స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అందులో "నాకు ఒకే ఒక్క కూతురు... ఆమె పేరు మణెమ్మ" అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోలో దర్శకుడు శివ నిర్వాణ, బాలనటి నక్షత్ర కూడా కనిపించారు. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు జి.వి. ప్రకాశ్‌కుమార్ రీ-రికార్డింగ్ పనులు కూడా ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కూతురిపై అపారమైన ప్రేమ చూపించే తండ్రిగా రవితేజ కనిపించారు. అనూహ్య సంఘటనల తర్వాత మద్యానికి బానిసైన అతడు, కూతురు మాటతో అయ్యప్ప మాల ధరించి జీవితాన్ని మార్చుకునే ప్రయాణం కథలో కీలకంగా ఉండనుంది. రవితేజ కెరీర్‌లో 77వ చిత్రంగా వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను సమపాళ్లలో మేళవించినట్లు చిత్రబృందం చెబుతోంది. తండ్రీకూతుళ్ల అనుబంధమే కథకు ప్రధాన బలమని సమాచారం. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, శ్వాసిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbullapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com